క్లుప్తంగా

నేడు చీఫ్‌విప్ ముదునూరి షెడ్యూల్ ఇలా..

నరసాపురం: ఢిల్లీ వెళ్లిన ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు శుక్రవారం నరసాపురం చేరుకున్నారు. శనివారం ఆయన ఉదయం 10 గంటలు నుంచి కార్యాలయంలో అందుబాటులో ఉంటారని ఆయన కార్యాలయ వర్గాలు తెలిపాయి. అనంతరం పార్టీ మండల కమిటీ సమావేశం నిర్వహిస్తారని పేర్కొన్నాయి. సాయంత్రం 4 గంటలకు లిఖితపూడి గ్రామంలో రూ.15 లక్షలతో నిర్మించిన ఎస్సీ కమ్యూనిటీహాల్‌ను ప్రారంభిస్తారు. మళ్లీ సాయంత్రం 4 గంటలు నుంచి పార్టీ కార్యాలయంలో అందుబాటులో ఉంటారు. అనంతరం పార్టీ పట్టణ కమిటీ సమావేశం నిర్వహిస్తారు.

రామన్నపాలెంలో ఆలస్యంగా దిగుబడి



రామన్నపాలెంలో చేతికొచ్చిన పంట

మొగల్తూరు: మండలంలోని రామన్నపాలెం గ్రామంలో దాళ్వా సాగు ఆలస్యంగా చేపట్టడంతో పంట చేతికందేందుకు ఆలస్యమవుతుంది. మండలంలోని మొగల్తూరు, శేరేపాలెం, కెపిపాలెం, పేరుపాలెం, రామన్నపాలెం గ్రామాల్లో సుమారు 1197 ఎకరాల్లో దాళ్వా సాగు చేపట్టారు. అయితే రామన్నపాలెం మినహా మిగిలిన గ్రామాల్లో ముందుగా సాగు చేపట్టి 1121 రకం విత్తనాలు వినియోగించడంతో ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకున్నారు. అయితే రామన్నపాలెంలోని సుబ్రమణ్య స్వామి గుడి ప్రాంతంలోని రైతులు సుమారు 103 ఎకరాల్లో నాలుగు నెలల కాలానికి చేతికొచ్చే 1153 రకం విత్తనాలు వినియోగించడంతో పంటచేతి కందడం ఆలస్యమైంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో రెండు, మూడు వారాల్లో నాట్లు వేయడంతో పంట దిగుబడి ఆలస్యమైందని మరో రెండు మూడు రోజుల్లో వరి కోతలు ప్రారంభం కానున్నాయని ఏవో సుజాత తెలిపారు.

వికలాంగునికి ట్రై సైకిల్ అందజేత



వికలాంగునికి ట్రై సైకిల్ అందిస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: స్థానిక అచ్చుగట్లపాలెం శ్రీ ముఖధారమ్మ ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో శుక్రవారం వికలాంగునికి ట్రై సైకిల్ బహూకరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షులు కుంపట్ల చిన్నరాజా మాట్లాడుతూ ఆలయ నూతన కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారి సేవతో పాటు సమాజానికి తమ వంతు సహాయ సహకారాలు అందించనున్నట్లు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులతో పాటు లలితా మహిళా మండలి సభ్యురాళ్ల సహకారంతో మేకా సుబ్రహ్మణ్యానికి రూ. 10 వేలు విలువ చేసే ట్రై సైకిల్ అందించామన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షులు వల్లభు శ్రీనువాసు, సెక్రటరీ చినిమిల్లి బాబి, ఉపాధ్యక్షులు చెక్కా కృష్ణ, జాన మురళి, బెల్లంకొండ నరసింహరావు, వెలిగట్ల గణేష్, పాండు రంగారావు, మిద్దే రాము తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పట్టాలివ్వడం సాహసోపేత నిర్ణయం



కుంచిలపల్లి వినిస్టన్‌బాబు

పాలకొల్లు అర్బన్: రాజధాని అమరావతిలో 50వేల మందికి ఇంటి పట్టాలు ఇవ్వడం సాహసోపేత నిర్ణయమని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కుంచిలపల్లి వినిస్టన్‌బాబు అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 1200 ఎకరాల భూమిలో 25 లేఅవుట్లగా విభజన చేసి పేదలకు పట్టాలు ఇవ్వడం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం అభినందనీయమని పేర్కొన్నారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా 32లక్షల మంది నిరుపేదలకు ఇంటి పట్టాలిచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దేనని వివరించారు. పేదవాడి గుండెల్లో సీఎం జగన్ చిరస్థాయిగా నిలిచి పోతారని కొనియాడారు. పేదల పట్టాల పంపిణీ విషయంలో చంద్రబాబునాయుడు చేసిన కుట్ర మరోసారి బహిర్గతమైందని వివరించారు. సెంటు భూమిలో సమాధులు కట్టుకోవడానికి పనికి వస్తుందని చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు పేదల మనోభావాలు దెబ్బతీశాయని మండిపడ్డారు.

సేవలను సద్వినియోగం చేసుకోవాలి

పెనుగొండ: వడలిలో ఎస్బీఐ ఖాతాదారులకు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని అసిస్టెంట్ జనరల్ మేనేజరు వి.కృష్ణమోహన్ అన్నారు. జెడ్పీ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన ఖాతాదారుల ఆత్మీయ సదస్సులో పాల్గొని మహిళా సమాఖ్యకు చెక్కు అందించారు. ముద్ర రుణాలు, వ్యవసాయ రుణాలు, విద్యార్థులకు విద్యా రుణాలు అందిస్తున్నామని తెలిపారు. ఎస్బీఐ పథకాలను వివరిస్తూ సాగిన బుర్ర కథ ఆకట్టుకుంది. కార్యక్రమంలో సర్పంచ్ కాసాని విజయలక్ష్మీ, ఎంపీడీఓ డీబీఆర్ కృష్ణంరాజు, రీజనల్ మేనేజరు సీజీవీ రంగాచార్యులు, వడలి బీఎం వై.లీలా పూర్ణిమ, ఎంపీటీసీ సభ్యుడు రెడ్డి గణేష్, చిటికెన దుర్గ బాబీ పాల్గొన్నారు.

గ్రామాల్లో ధాన్యం కొనుగోళ్ల జోరు

- దాదాపు 98 శాతం పూర్తి
- సకాలంలో రైతుల ఖాతాల్లో సొమ్ములు జమ
- దళారీ వ్యవస్థకు చెక్



లంకలకోడేరులో ధాన్యం ఆరబోసుకుంటున్న రైతు



కాపవరంలో ధాన్యాన్ని మిల్లుకి తరలించేందుకు పట్టుబడి చేస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: రబీ పంట రైతు చేతికి చేరింది. గత నాలుగేళ్ల నుంచి రైతులకు రెండో పంటకు సాగు నీరు ఇబ్బందులు తొలగాయి. దీంతో ఆనందంగా రైతులు పంట సాగు చేసుకున్నారు. రైతుల అంచనాలకు తగ్గట్టుగానే దిగుబడి వచ్చింది. ఎకరానికి 40 నుంచి 50బస్తాలు దిగుబడి రావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పాలకొల్లు నియోజకవర్గంలో పాలకొల్లు, యలమంచిలి, పోడూరు మండలాల్లో రబీ పంట దాదాపు 98 శాతం కోతలు పూర్తయ్యాయి. అడపా దడపా కళ్లాల్లోనూ, అక్కడక్కడా కోతలు కోయాల్సి ఉంది.

రైతులను భయపెట్టిన ప్రకృతి

రబీ కోతలు ప్రారంభంలోనే ప్రకృతి రైతులను భయపెట్టింది. అకాల వర్షాల కారణంగా ధాన్యం కళ్లాల్లోనూ, పనల మీద తడిసిపోయింది. దీంతో మిల్లర్లు రైతుల నుంచి క్వింటాకు 8 కిలోలు అదనంగా తీసుకున్నారు. దీంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వం సకాలంలో స్పందించి మిల్లర్లతో మాట్లాడి రైతుల సమస్యలు పరిష్కరించింది. అలాగే ధాన్యం మిల్లుకి తోలిన మూడో రోజునే రైతుల ఖాతాల్లోకి సొమ్ములు జమ చేసింది. క్వింటాకి రూ.2040, బస్తాకి రూ.1530లు చెల్లిస్తోంది. దీంతో పాటు ఎగుమతి, దిగుమతికి జట్టు కూలి, రవాణా, సంచుల నిమిత్తం ఎకరానికి సుమారు రూ.1300 రైతుల ఖాతాలకు చెల్లిస్తోంది.

మండలం	వరి విస్తీర్ణం (ఎకరాల్లో)	కొనుగోలు చేసిన ధాన్యం (మెట్రిక్ టన్నుల్లో)	రైతుల సంఖ్య
పాలకొల్లు	9834	24,180	3,172
యలమంచిలి	5,760	13,195	1930

దళారీ వ్యవస్థకు అడ్డుకట్ట...

గతంలో ధాన్యం విక్రయించాలంటే రైతులు దళారీని నమ్ముకునే వారు. ప్రస్తుతం ప్రభుత్వ అధికారుల ద్వారా నేరుగా మిల్లర్లను సంప్రదించి ధాన్యం విక్రయిస్తున్నారు. దీన్ని రైతులు స్వాగతిస్తున్నారు. దళారీ రైతుకి ముందస్తుగా పెట్టుబడు పెట్టి పంట చేతికి అందగానే వడ్డీ రూపంలో అధిక మొత్తం వసూలు చేసేవారు. దీని వల్ల రైతులు ఆరుగాలం శ్రమించిన పంట దళారీని పెంచిపోషించడానికి సరిపోయేది. ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన విధానం రైతులకు అన్ని విధాలా మేలు జరుగుతుందని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

అకాల వర్షాలు రైతులను నష్టపరిచాయి



దాళ్వా సాగుకు సాగు నీటి ఎద్దడి, ఇతర సమస్యలు ఏమీ లేవు. పంట దిగుబడి కూడా బాగానే వచ్చింది. అయితే అకాల వర్షాలు రైతులను ఇబ్బందులు గురి చేశాయి. దీంతో ధాన్యం విక్రయించుకోవడానికి రైతులకు ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వం సకాలంలో స్పందించడంతో సమస్య సానుకూలమైంది.

– షేక్ అబ్దుల్ రహీం, మండల వ్యవసాయాధికారి, పాలకొల్లు

మిల్లు చిరునామా కూడా తెలిసేది కాదు



గతంలో ధాన్యం అమ్ముకోవాలంటే దళారిని నమ్ముకోవాలి. దళారి మిల్లు యజమానికి ఏజెంట్ వ్యవహరించేవారు. దళారీ రైతు పండించిన ధాన్యానికి ధర నిర్ణయించేవారు. అతను ఎంతంటే అంతే ధర రైతుకి దక్కేది. అసలు రైస్‌మిల్లు చిరునామా, మిల్లర్ పేరు కూడా రైతుకి తెలిసేది కాదు. ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకుంది. దళారీ వ్యవస్థకు చెక్ పెట్టింది. ప్రభుత్వమే ధాన్యం విక్రయించి రైతులకు సొమ్ములు చెల్లిస్తోంది.

– తందా ఇస్సాక్‌రాజు, కౌలు రైతు, శివదేవునిచిక్కాల

నేడు పెనుమంట్ర మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

పెనుమంట్ర: పెనుమంట్ర మండల సర్వసభ్యసమావేశం ఈ నెల 27వ తేదీన ఉదయం 10 గంటల 30 నిమిషాలకు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తామని ఎంపిడీఓ వి.పూర్ణబాబు శుక్రవారం తెలిపారు. ఎంపీపీ కర్రి వెంకటనారాయణ రెడ్డి(వాసు) అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద 2023–24 సంవత్సరంలో చేపట్టాల్సిన పనులపై చర్చిస్తామని వివరించారు. మండల స్థాయిలో వివిధ ప్రభుత్వ శాఖల అభివృద్ధిపై సమీక్షిస్తామని వివరించారు. ఆయా శాఖల అధికారులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు తప్పక హాజరు కావాలని ఆయన తెలిపారు.

దుర్గమ్మకు సలిమార మహోత్సవం



ఆలయ ఆవరణలో లలితసహస్ర పారాయణం నిర్వహిస్తున్న భక్తులు

పెనుమంట్ర: స్థానిక శ్రీ కనకదుర్గమ్మ ఆలయంలో శుక్రవారం అమ్మవారికి గ్రామస్తులు సలిమార మహోత్సవం నిర్వహించారు. పెనుమంట్ర యూత్ లైన్స్ ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామ శ్రేయస్సు కోరుతూ అమ్మవారికి మధ్యాహ్నం చలిమిడి,పానకాలు ప్రతీ ఇంటి నుంచి కావిడితో తీసుకువెళ్లి సమర్పించారు. ఉదయం అమ్మవారికి పెద్ద ఎత్తున మహిళలు కుంకుమపూజలు నిర్వహించి అనంతరం లలితసహస్రపారాయణం చేశారు. ప్రతీ ఏటా వేసవిలో ఈ సలిమార మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ తమనంపూడి సాయినారాయణరెడ్డి తెలిపారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలి

మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు



పెనుమంట్రలో మాట్లాడుతున్న మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు

పెనుమంట్ర: వలంటీర్లు పిల్లల చదువులపై మరింత శ్రద్ధతీసుకుని జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను గ్రామస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని మాజీ మంత్రి, స్థానిక శాసన సభ్యులు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. శుక్రవారం పెనుమంట్రలోని శ్రీసాయినాథ కళ్యాణ మండపంలో నిర్వహించిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలంటీర్లు పింఛన్‌లు పంపిణీ మాత్రమే కాకుండా రాబోవు కాలంలో గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనలో భాగస్వాములు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. గ్రామాల్లో ముఖ్యంగా డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపర్చి ప్రజలు పరిసరాల పరిశుభ్రతను పాటించే విధంగా వలంటీర్లు అవగాహన కల్పించాలన్నారు. గతంలో అనేక వాగ్దానాలను చేసిన చంద్రబాబు బంగార రుణాలు మాఫీ చేస్తామని మహిళలని, పంట రుణాలు మాఫీ చేస్తామని రైతులని అప్పుల పాలు చేసి దారుణంగా మోసం చేశారని జగనన్న ప్రభుత్వం ఇచ్చిన హామీలను పూర్తిచేసిన తరువాతనే ఎన్నికలలో వచ్చి ఓటు అడుగుతుందని, ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేసిన ఘనత జగనన్న ప్రభుత్వానిదేనని అన్నారు. నియోజకవర్గంలో 14 వేల మందికి ఇళ్లపట్టాలు, 18 వేల మందికి గృహ నిర్మాణాలు కోసం సాయం మంజూరు చేశామని పేర్కొన్నారు. నియోజకవర్గంలో మాజీ మంత్రి పితాని సత్యనారాయణ 2019 వరకు సమస్యలను గాలికి వదిలేశారని మండిపడ్డారు. ప్రస్తుతం ప్రభుత్వం గ్రామాల్లో కరెంటు, రోడ్లు, మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యత ఇచ్చి తమ ప్రభుత్వం త్వరితగతిన పనులు పూర్తి చేస్తుందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా మండలంలో ఇద్దరు వలంటీర్లకు వజ్ర, ఐదుగురు వలంటీర్లకు రత్న, 251 మంది వలంటీర్లకు సేవామిత్ర అవార్డులను ఆయన చేతులు మీదుగా వలంటీర్లకు అందజేశారు. సత్యవరం గ్రామానికి చెందిన కుసుమే వంశీ, వెలగలవారిపాలెంకు చెందిన పిల్లి సాయి వజ్ర అవార్డులు అందుకోగా, నల్లిమిల్లి కనికిరెడ్డి(ఆలమూరు), ద్వారంపూడి దివ్య(వెలగలవారిపాలెం), పెనుగొండ పుష్ప(సత్యవరం), పొలమూరి భవానీశ్రుతి(మాముడూరు), దొంగ నాగ యామినీ దుర్గ(నెగ్గిపూడి) రత్నా అవార్డులు అందుకున్నారు. ఎంపీపీ కర్రి వెంకట నారాయణరెడ్డి(వాసు) అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పెనుగొండ ఏఎంసీ చైర్ పర్సన్ వెలగల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యురాలు కర్రి గౌరీ సుభాషిణి, మండల పరిషత్ ఉపాధ్యక్షులు ఈది అనిత, వాసంశెట్టి కిరణ్, తహసీల్దార్ డీవీఎస్ అశోక్‌వర్మ, ఎంపీడీఓ పి.పూర్ణబాబ్జి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గూడూరి దేవేంద్రుడు, ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు బుర్రా రవికుమార్, బీసీసెల్ మండల అధ్యక్షుడు దొంగ దుర్గా ప్రసాద్, పెనుమంట్ర, వెలగలవారిపాలెం గ్రామ కమిటీ అధ్యక్షులు తేతలి సుధీర్‌రెడ్డి, తాడి రాజారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు గండి రామారావు, పెచ్చెట్టి మంగాదేవి, మాండ్రు శాంతకుమారి, కర్రిఅనురాధ, గ్రామ సర్పంచ్ తమనంపూడి వీర్రెడ్డి, ముదునూరి నాగరాజు, తాడిపర్తి ప్రియాంక పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక ఉత్సవాలు ఐక్యతకు చిహ్నాలు



అన్నసమారాధనలో భక్తులకు ప్రసాదాలు వడ్డిస్తున్న ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్

పాలకొల్లు అర్బన్: ఆధ్యాత్మిక ఉత్సవాలు ప్రజల మధ్య ఐక్యతకు చిహ్నాలుగా నిలుస్తాయని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ అన్నారు. పాలకొల్లు చింతలతోటలో ఉన్న శ్రీ దేశాలమ్మ అమ్మవారి జాతర ముగింపు ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన భారీ అన్నసమారాధనలో ఎమ్మెల్సీ శ్రీనివాస్ పాల్గొని భక్తులకు ప్రసాదాలు వడ్డించి అన్నసమారాధనను ప్రారంభించారు. ముందుగా శ్రీనివాస్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, పట్టణ పార్టీ అధ్యక్షుడు చందక సత్తిబాబు, మాజీ కౌన్సిలర్ చందక ఉమాశైలజ పాల్గొన్నారు.

వీవర్స్ కాలనీ డ్రైడే ర్యాలీ

పాలకొల్లు అర్బన్: ఇంటి పరిసరాల్లో మురునీటి గుంటలు లేకుండా ఆరోగ్య సిబ్బంది చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని 22, 23 వార్డుల్లో శుక్రవారం ఆరోగ్య సిబ్బందితో కలిసి నిర్వహించిన డ్రై డే ర్యాలీలో శ్రీనివాస్ పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు చందక సత్తిబాబు, వార్డు ఇన్‌చార్జ్ పిల్లా శ్రీనివాస్, వార్డు నాయకులు శిడగం కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కాలేజీల్లో లెక్చరర్ల నియామకం



కేపీ పాలెంలో విద్యార్థిని ఇంటికెళ్లి దరఖాస్తులు స్వీకరిస్తున్న లెక్చరర్లు

మొగల్తూరు: ఈ విద్యా సంవత్సరం నుంచి కేపీ పాలెం మహిళా జూనియర్ కాలేజీలో చేరేందుకు అడ్మిషన్లు స్వీకరిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ జంగా వెంకట నరసింహ మూర్తి శుక్రవారం తెలిపారు. గత సంవత్సరం నుండి ఇంటర్‌లో బైపీసీ, సీఈసీ గ్రూపులు ప్రారంభమయ్యాయన్నారు. అయితే ఈ విద్యాసంవత్సరంలో 9 మంది లెక్చరర్స్‌ను నియమించగా 7 మంది బాధ్యతలు స్వీకరించారన్నారు. ఇంగ్లిష్ లెక్చరర్‌గా సీహెచ్ కృష్ణ మోహన్, ఫిజిక్స్‌కు పి.జితేంద్ర కుమార్, బాటనీకు కేవీ మంగతాయారు, జువాలజీకు కె.నాగరాజు, ఎకనామిక్స్‌కు వి.సత్యనారాయణ, కామర్స్‌కు కె.కళాకార రాజు, కెమిస్ట్రీకు పి.శ్రీనివాసరావులు నియమితులయ్యారన్నారు. గత నాలుగు రోజులుగా తీర ప్రాంత గ్రామాల్లో పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులను గుర్తించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించి వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి విద్యపై ఉన్న మక్కువతో మండలంలోని కేపీ పాలెంలో మహిళలకు, ముత్యాలపల్లిలో బాలురకు రెండు జూనియర్ కాలేజీలకు అనుమతిచ్చారని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ నరసింహ మూర్తి కోరారు.

మార్టేరు క్రీడాకారుల ప్రతిభ అభినందనీయం



తూర్పుపాలెంలో క్రీడాకారులను అభినందిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: క్రీడాల్లో మార్టేరు క్రీడాకారులు చూపుతున్న ప్రతిభ అభినందనీయమని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. ఇటీవల ఉల్లంపర్రులో జరిగిన రాష్ట్ర స్థాయి యూత్ బాస్కెట్ బాల్ చాంపియన్ షిప్‌లో పశ్చిమగోదావరి జిల్లాను మూడో స్థానంలోనూ, రాష్ట్ర స్థాయి సీఎం కప్ పోటీల్లో నాల్గవ స్థానంలో నిలిపిన క్రీడాకారులనూ, జాతీయ పోటీలకుగాను కోచింగ్ క్యాంపుకు ఎన్నికైన ఎస్ కిషోర్, ఎస్ సందీప్‌లను శుక్రవారం తూర్పుపాలెంలో జరిగిన కార్యక్రమంలో అభినందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు చిన్నం ఏడుకొండలు, ఆచంట మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్, వైఎస్సార్ సీపీ నాయకులు కర్రి వేణుబాబు, అల్లం భాస్కరరెడ్డి, పీడీ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

శ్రీరంగనాథరాజుకు కృతజ్ఞతలు

ఆచంట కాపుల పాలెంలో కాపు కమ్యూనిటీ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజుకు కాపు సంఘ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం తూర్పుపాలెంలో కాపులపాలేనికి చెందిన నాయకులు భారీగా తరలి వచ్చారు. నిర్మాణం వేగంగా చేసుకోవాలని వారికి సూచించారు. కార్యక్రమంలో ఆచంట ఉప సర్పంచ్ అడ్డాల పెద్దిరాజు, సచివాలయ కన్వీనరు బాలాజీ, గంటా శ్రీను, మేడిచర్ల పండు, కోట వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం



చిరు ధాన్యాలతో తయారు చేసిన జావను రోగులకు అందజేస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: చిరు ధాన్యాలతో తయారు చేసిన పదార్థాలు సంపూర్ణ ఆరోగ్యానిస్తాయని డా. అడ్డాల ప్రతాప్‌కుమార్ అన్నారు. లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో తెలుగుతల్లి వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గత 30 రోజుల నుంచి ఆసుపత్రికి వచ్చే రోగులకు చిరు ధాన్యాలతో తయారు చేసిన జావను అందజేస్తున్నారు. ఈ సందర్భంగా తెలుగుతల్లి వాకర్స్ క్లబ్ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. నవ్యజీవన్, భవానీ ప్రసాద్, గుడాల హరిబాబు, కె ప్రభాకరరావు, ఫార్మాసిస్టు పీవీ స్వామి పాల్గొన్నారు.

గ్రంథాలయంలో బొమ్మల తయారీపై శిక్షణ



విద్యార్థులకు శిక్షణలో రిటైర్డ్ ఉపాధ్యాయులు

పాలకొల్లు సెంట్రల్: విద్యార్థులు క్రమశిక్షణ, నైతిక విలువలు కలిగి ఉండాలని విశ్రాంత ఉపాధ్యాయులు పోలిశెట్టి గోఖలే అన్నారు. శుక్రవారం వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు ముఖ్యమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా గోఖలే మాట్లాడుతూ విద్యార్థి దశలో క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్యను ఎప్పుడైతే అవలంబిస్తారో ఆ విద్యార్థి అన్ని లక్ష్యాలను నెరవేర్చుకోగలరని అన్నారు. ముందుగా కేవీవీ సత్యనారాయణ విద్యార్థులకు స్పాంజి బొమ్మల తయారీపై శిక్షణ ఇచ్చారు. అనంతరం యోగా ఆసనాలపై తర్ఫీదునిచ్చారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారిణి వి శాంతకుమారి, వెంకట్రావు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో విద్యార్థులను చేర్పించాలి



వడలిలో సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాలపై అవగాహన కల్పిస్తున్న నరసమ్మ

పెనుగొండ: రాష్ట్ర ప్రభుత్వం వసతి గృహ విద్యార్థులకు ఎన్నో సదుపాయాలు కల్పిస్తుందని, తల్లిదండ్రులు విద్యార్థులను వసతి గృహాల్లో చేర్పించాలని ఆచంట మండలం వల్లూరు సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహ అధికారిణి కేవీ నరసమ్మ తెలిపారు. వడలి పంచాయతీ వద్ద విద్యార్థులకు వసతి గృహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆచంట మండల సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో మూడో తరగతి నుంచి 9వ తరగతి చదువుతున్న విద్యార్థులను చేర్చాలన్నారు. ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ కాసాని విజయలక్ష్మీ, బాలుర వసతి గృహ సంక్షేమ అధికారి ఎంపీ సూర్యనారాయణ, ఎంపీటీసీలు రెడ్డి గణేష్, చిటికెన దుర్గ బాబీ తదితరులు పాల్గొన్నారు.

పక్కా డ్రెయిన్ నిర్మించాలి

నరసాపురం: పట్టణంలోని పాత రూరల్ పోలీస్ స్టేషన్ రోడ్డులో ఉన్న డ్రెయిన్ శిథిలమైంది. మురుగు పారక పోవడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 15 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ డ్రెయిన్‌ను పునర్నిర్మించాల్సిన అవసరముంది. అయితే మునిసిపల్ అధికారులు ఈ అంశంపై దృష్టి పెట్టడం లేదని పట్టణ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక రాజరాజేశ్వరి థియేటర్ వద్ద నుంచి ఈ డ్రెయిన్‌ను ఆనుకుని పెద్ద సంఖ్యలో ఇళ్లు ఉన్నాయి. ఈ ఇళ్లకు సంబంధించిన వాడకపు నీరంతా ఈ డ్రెయిన్ మీదుగానే వెళ్లాలి. ఈ డ్రెయిన్ రూరల్ పోలీస్ స్టేషన్ అవతల కొద్ది దూరంలో మెయిన్ డ్రెయిన్‌లో కలుస్తుంది. ప్రస్తుతం డ్రెయిన్ శిథిలం కావడంతో మురుగు సవ్యంగా పారడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పక్కా డ్రెయిన్ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

బంగారం మెరుగుపెడతామంటే నమ్మొద్దు

పాలకోడేరు: బంగారం మెరుగు పెడతామంటూ గ్రామాల్లో తిరుగుతోన్న మోసగాళ్లను నమ్మవద్దని ఎస్సై నాళం శ్రీనివాసరావు పేర్కొన్నారు. నరసాపురం మండలం లక్ష్మణేశ్వరం గ్రామంలో బంగారం మెరుగు పెడతామని వచ్చి, ఎనిమిది కాసుల బంగారం గాజులు అపహరించుకుపోయారని తెలిపారు. అలాంటివారు ఎవరైనా తారసపడితే తమకు సమాచారం అందించాలని, అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

జగనన్న కాలనీల్లో సకల సౌకర్యాలు

కాళ్ల: ముఖ్యమంత్రి పేదలకు ఇస్తున్న జగనన్న కాలనీలలో సకల సౌకర్యాలు ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు తెలిపారు. వేంపాడులో జగనన్న కాలనీలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. ఈ పనులను పీవీఎల్ నరసింహారాజు చేతుల మీదుగా శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్ల నిర్మాణానికి సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఎంతో సాయం చేస్తున్నారని అన్నారు. గత టీడీపీ పాలనలో సెంటు భూమి కూడా ఇవ్వని తెలుగుదేశం నాయకులు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిపై విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి తరువాత పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. వేంపాడులో సుమారు 51 స్థలాలు జగనన్న కాలనీలో ఇవ్వగా సుమారు 30 ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకున్నాయని.. కాలనీ వాసులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని స్పష్టం చేశారు. సర్పంచ్ ఈ.పద్మావతి, ఎంపీపీ పెనుమత్స విశ్వనాథరాజు, మాజీ సర్పంచ్ వీరమల్లు బోసు, వేగేశ్న సుమన్, వీరమల్లు చిన్న గంగయ్య, దాసరి సత్యనారాయణ, ఎం.చిన్న పాల్గొన్నారు.